మోదీపై కమెడియన్ పోటీ

న్యూఢిల్లీ, మే 1: తన హాస్యం ద్వారా ప్రేక్షకులను నవ్వించే కమెడియన్ రంగీలా ఇప్పుడు రాజకీయ ప్రవేశం చేస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీని అనుకరించే 29 ఏండ్ల శ్యామ్ రంగీలా కామెడీ ద్వారానే రాజకీయాలు చేస్తానంటూ ఏకంగా ఆయన మీదనే వారణాసిలో పోటీకి దిగుతానని ప్రకటించారు. మనస్ఫూర్తిగా తాను ఎన్నికల బరిలో దిగుతున్నానని, నామినేషన్ వేసేందుకు వచ్చే వారం వారణాసికి వస్తున్నట్టు చెప్పారు. సూరత్, ఇండోర్‌లా కాకుండా వారణాసి పౌరులకు ఓటేసే అవకాశం కల్పిస్తానని, ఒక వేళ అందరు అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకున్నా తాను మాత్రం బరిలో ఉంటానని, దాంతో ఎన్నిక తప్పక జరుగుతుందని ఆయన అన్నారు. వాస్తవానికి తాను ఫకీర్‌నని, తన వద్ద ఏమీ లేదని, బ్యాగ్‌తో వచ్చి దానితోనే వెళ్లిపోతానని, కాబట్టి తనకు ఈడీ దాడుల భయం లేదని అన్నారు.

ఓటెయ్యకుంటే.. కరెంట్ కట్!

- ఇందులో వెనక్కి తగ్గేది లేదు
- ప్రజలకు కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజు బెదిరింపులు
- హస్తం పార్టీ 'బెదిరింపుల దుకాణం'గా మారింది: బీజేపీ



రాజు కాగే

బెళగావి, మే 1: లోక్‌సభ ఎన్నికల వేళ కర్ణాటకలో కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజు కాగే ప్రజలపై బెదిరింపులకు పాల్పడ్డారు. తమ పార్టీకి ఓటేయకుంటే మీ గ్రామానికి కరెంట్ కట్ చేయిస్తానంటూ హెచ్చరికలు చేశారు. ఈ విషయంలో వెనక్కు తగ్గే సమస్యే లేదని, తన మాటలకు కట్టుబడి ఉంటానని కుండ బద్దలు కొట్టారు. ఎమ్మెల్యే రాజు కాగే తాజాగా చేసిన ఈ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బెళగావి జిల్లాకు చెందిన కంగ్వాడ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజు కాగే తన నియోజకవర్గంలోని జుగులాటోలో జరిగిన ఓ బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ఓటేసి, చిక్కోడి లోక్‌సభ స్థానాన్ని భారీ మెజార్టీతో గెలిపించాలని అట్టిమేటం జారీచేశారు. అలా జరుగకపోతే, గ్రామానికి కరెంట్ కట్ చేయిస్తానని ప్రజలకు హెచ్చరించారు. రాజు వ్యాఖ్యలపై బీజేపీ స్పందిస్తూ కాంగ్రెస్ 'బెదిరింపుల దుకాణం'గా మారిందని విమర్శించింది. 'మీ పనులు కావాలంటే నా తమ్ముడికే ఓటేయాలి' ఇటీవల డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఓటర్లను బెదిరించారని బీజేపీ అధికార ప్రతినిధి షేహజాద్ పునావాలా గుర్తుచేశారు.

ఒక వేళ మోదీ చనిపోతే..!

రాజు కాగే 2019లో బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేశారు. వివాదాస్పద వ్యాఖ్యలకు ఆయన పెట్టింది పేరు. మంగళవారం రాజు కాగే ఓ సభలో మాట్లాడుతూ ప్రధాని మోదీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. బీజేపీ, మోదీ నినాదాలు ఇచ్చే కొంత మంది యువకులను విమర్శిస్తూ 'ఒక వేళ రేపు మోదీ చనిపోతే? 140 కోట్ల మంది జనాభా ఉన్న ఈ దేశంలో ఇంకెవరూ ప్రధాని కాలేరా? దేశానికి ఆ సామర్థ్యం లేదా?' అని వ్యాఖ్యానించారు. కాగా, రాజు చేసిన ఈ వ్యాఖ్యలపై బీజేపీ మండిపడింది. కాంగ్రెస్ పార్టీ ప్రధాని మోదీ చనిపోవాలని కోరుకుంటుందా? అని కర్ణాటక బీజేపీ ఎక్స్ పోస్టులో ప్రశ్నించింది.

మోదీపై బ్రిటిష్ ఇండియన్లలో వ్యతిరేక అభిప్రాయం

న్యూఢిల్లీ: భారత ప్రధాని నరేంద్రమోదీపై బ్రిటన్‌లోని భారతీయుల్లో వ్యతిరేక అభిప్రాయం ఉన్నట్టు తాజా సర్వేలో తేలింది. సర్వే చేసిన హిందువుల్లో 50 శాతం మంది హిందూత్వ సిద్ధాంతాలను వ్యతిరేకించారు. ప్లాట్‌ఫామ్ ఫర్ ఇండియన్ డెమొక్రసీ 500 మంది బ్రిటిష్ ఇండియన్లపై ఈ సర్వే నిర్వహించింది. సర్వేలో పాల్గొన్న వారిలో 52 శాతం మంది మోదీపై ప్రతికూల అభిప్రాయం వ్యక్తం చేయగా, 35 శాతం మంది మోదీకి మద్దతుగా నిలిచారు. హిందువుల్లో 57% మంది మోదీకి మద్దతుగా నిలువగా, హిందూయేతరుల్లో 71%o మంది మోదీని వ్యతిరేకించారు. మోదీపై ప్రతికూల అభిప్రాయాలు వ్యక్తం చేసిన వారిలో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఉన్నారు. దేశం సరైన దిశలో పయనిస్తున్నదని 68% మంది హిందువులు అభిప్రాయపడగా, 73% మంది హిందూయేతరులు, 81% ముస్లింలు వ్యతిరేకించారు.

మోదీ కార్పొరేట్ సర్కార్

- ఎన్డీయే పాలనలో బడా పారిశ్రామికవేత్తలకే లబ్ధి!
- పేదలపై పన్నులు.. కార్పొరేట్లకు రాయితీలు
- 2014లో 32 శాతంగా కార్పొరేట్ ట్యాక్స్ వాటా 2023 నాటికి 26 శాతానికి తగ్గుదల
- అదే సమయంలో వ్యక్తిగత ఆదాయపన్ను వాటా 21 శాతం నుంచి 28 శాతానికి పెరుగుదల

న్యూఢిల్లీ, మే 1: పేద, మధ్యతరగతి ప్రజల ఆదాయాన్ని పెంచి, వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటును అందించడం ప్రభుత్వ బాధ్యత. ఈ బాధ్యతను దృష్టిలో పెట్టుకొనే ప్రభుత్వం పన్నుల విధానానికి రూపకల్పన చేయాలి. పేదలపై పన్నుల భారం వీలైనంత తగ్గించే ప్రయత్నం చేయాలి. కానీ, పదేండ్ల మోదీ ప్రభుత్వ హయాంలో ఇందుకు పూర్తి భిన్నంగా జరుగుతున్నది. పేదలు, మధ్య తరగతి ప్రజలపై మోయలేని పన్నుభారం పడుతున్నది. మరోవైపు కార్పొరేట్లకు పన్నుల భారం తగ్గుతున్నది. ఆదాయానికి తగ్గట్టుగా చెల్లించాల్సిన ప్రత్యక్ష పన్నులను కేంద్రం తగ్గిస్తున్నది. ఆదాయంతో సంబంధం లేకుండా అందరిపైనా భారం మోపే పరోక్ష పన్నులను పెంచుతున్నది. ఫలితంగా పదేండ్ల మోదీ పాలనలో పేదలు మరింత పేదరికంలోకి కూరుకుపోతున్నారు. ధనికులు మరింత ధనవంతులు అవుతున్నారు.

పెరుగుతున్న వ్యక్తిగత ఆదాయ పన్ను

ప్రభుత్వానికి వస్తున్న మొత్తం పన్ను ఆదాయంలో వ్యక్తిగత ఆదాయ పన్ను శాతం క్రమంగా పెరుగుతున్నది. ఇదే సమయంలో కార్పొరేట్ పన్నుల వాటా తగ్గుతున్నది. వ్యక్తిగత ఆదాయ పన్ను అంటే.. దేశ ప్రజలు వారి ఆదాయంపై చెల్లించే పన్ను. కార్పొరేట్ పన్ను అంటే.. దేశంలో వ్యాపార, వాణిజ్యం ద్వారా కంపెనీలు ఆర్జిస్తున్న ఆదాయంపై చెల్లిస్తున్న పన్ను. మోదీ ప్రభుత్వం ఏర్పడకముందు 2013 – 14లో ప్రభుత్వ మొత్తం పన్ను ఆదాయంలో వ్యక్తిగత ఆదాయ పన్ను వాటా 20.6 శాతం ఉంటే, కార్పొరేట్ పన్ను వాటా 32.1 శాతం ఉండేది. 2023 – 24 నాటికి వ్యక్తిగత ఆదాయ పన్ను వాటా 28.1 శాతం ఉండగా, కార్పొరేట్ పన్ను వాటా 26 శాతానికి తగ్గింది. అంటే, మోదీ ప్రభుత్వం ఏర్పడే నాటికి మొత్తం పన్ను ఆదాయంలో వ్యక్తిగత పన్ను కంటే కార్పొరేట్ పన్ను వాటా దాదాపు 11.5 శాతం ఎక్కువ ఉండేది. ఇప్పుడు 2.1 శాతం తక్కువ ఉన్నది. అంటే, ఈ పదేండ్లలో వ్యక్తిగత ఆదాయ పన్ను వసూలు ఎంతగా పెరిగిందో, కార్పొరేట్ పన్ను రాబడి ఎంత తగ్గిందో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా 2019 సెప్టెంబరులో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ పన్నులను భారీగా తగ్గించడంతో ఈ అంతరం పెరిగిపోయింది. కార్పొరేట్లు లాభపడ్డారు.

పరోక్ష పన్నుల బాదుడు

పన్నుల్లో ప్రత్యక్ష పన్నులు, పరోక్ష పన్నులు ఉంటాయి. ప్రత్యక్ష పన్నులంటే వ్యక్తులు, కంపెనీల ఆదాయంపై నేరుగా విధించే పన్నులు. ఆదాయానికి తగ్గట్టుగా పన్ను ఉంటుంది. అంటే, ఎక్కువ ఆదాయం పొందే వారు ఎక్కువ పన్ను చెల్లించాల్సి ఉంటుంది. తక్కువ ఆదాయం ఉన్న వారిపై పన్నులభారం తక్కువ పడుతుంది. పరోక్ష పన్నులు అంటే ఆదాయంతో సంబంధం లేకుండా పరోక్ష పద్ధతిలో విధించే పన్నులు. ఉదాహరణకు.. ఎక్సైజ్ డ్యూటీలు, జీఎస్టీ వంటి పన్నులు. ఈ పన్నులకు ఆదాయంతో పని లేదు. ప్రజలంతా పరోక్షంగా వారు కొనే వస్తువులు, పొందే సేవలపై ఆ పన్ను చెల్లించాల్సిందే.

మొత్తం పన్ను ఆదాయంలో కార్పొరేట్, వ్యక్తిగత ఆదాయ పన్ను వాటా

ఆర్థిక సంవత్సరం	కార్పొరేట్ పన్ను	వ్యక్తిగత ఆదాయ పన్ను
2013-14	32.1	20.6
2018-19	28.1	21.3
2023-24	26.0	28.1

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్ను ఆదాయంలో ప్రత్యక్ష, పరోక్ష పన్నుల వాటా

ఆర్థిక సంవత్సరం	పరోక్ష పన్నులు	ప్రత్యక్ష పన్నులు
2013-14	39.4	60.6
2018-19	38.0	62.0
2021-22	34.2	65.8

మోదీ హయాంలో ప్రత్యక్ష పన్నులు తగ్గుతూ ఉంటే పరోక్ష పన్నులు పెరుగుతున్నాయి. అంటే, ఆదాయంతో సంబంధం లేకుండా అందరూ చెల్లించాల్సిన పన్నులు పెరుగుతున్నాయి. పేదలు, మధ్యతరగతిపై ఈ భారం పడుతున్నది. 2013 – 14లో పన్నుల ద్వారా ప్రభుత్వానికి వస్తున్న మొత్తం ఆదాయంలో ప్రత్యక్ష పన్నుల వాటా 39.4 శాతంగా ఉంటే 2021 – 22 నాటికి 34.2 శాతానికి తగ్గింది. ఇదే సమయంలో పరోక్ష పన్నుల వాటా 2013 – 14లో 60.6 శాతం ఉంటే, 2021 – 22 నాటికి 65.8 శాతానికి పెరిగింది.

ధరలు పైపైకి.. వేతనాలు అంతంతే

పన్నులే కాదు ఈ పదేండ్లలో పేదలపై మోయలేనంత ధరల భారం కూడా పడింది. ఇదే సమయంలో వేతనాలు మాత్రం చాలా స్వల్పంగా పెరిగాయి. గత ఐదేండ్లలో ఆహార వస్తువుల ధరలు దాదాపు 71 శాతం పెరిగితే, వేతనాలు మాత్రం కేవలం 37 శాతం మాత్రమే పెరిగాయని లెక్కలు చెప్తున్నాయి. ఉదాహరణకు ఐదేండ్ల క్రితం కిలో బియ్యం ధర రూ.35 – 40 ఉంటే ఇప్పుడు రూ.60కి చేరింది. గోధుమ పిండి ధర రూ.30 ఉంటే ఇప్పుడు రూ.43 ఉంది. ఇలా అన్ని ఆహార పదార్థాల ధరలు విపరీతంగా పెరిగినా ప్రజల ఆదాయం మాత్రం ఇందుకు తగ్గట్టుగా పెరగలేదు. ఫలితంగా పేద, మధ్య తరగతి ప్రజలు ఆర్థికంగా మరింత చితికిపోతున్నారు.

ఢిల్లీ కాంగ్రెస్‌కు మరో షాక్

ఇద్దరు మాజీ ఎమ్మెల్యేల రాజీనామా

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీతో పొత్తును ఢిల్లీ కాంగ్రెస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆ పార్టీ ఢిల్లీ విభాగాధిపతి అరవిందర్ సింగ్ లవ్లీ తన పదవికి రాజీనామా చేసినట్లు గానే మాజీ ఎమ్మెల్యేలు నీరజ్ బసోయా, నసీబ్ సింగ్ ఆ పార్టీకి రాజీనామా చేసి, తమ నిరసనను ప్రకటించారు. వీరిద్దరూ వేర్వేరుగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు తమ రాజీనామా లేఖలను పంపించారు. ఆప్‌తో పొత్తువల్ల కాంగ్రెస్ కార్యకర్తలు అవమానానికి గురయ్యారని తెలిపారు. ఎంత మాత్రం తాను పార్టీలో ఇమడలేనన్నారు. ఆప్, కాంగ్రెస్ మధ్య పంజాబ్‌లో పొత్తు లేదు. కానీ ఢిల్లీలో ఈ రెండు పార్టీలు లోక్‌సభ ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తున్నాయి.

అమిత్‌షా ఫేక్ వీడియో కేసు..

జార్ఖండ్ పీసీసీ చీఫ్‌కు సమన్లు

రాంచీ, మే 1: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఫేక్ వీడియో కేసులో ఢిల్లీ పోలీసులు జార్ఖండ్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేశ్ ఠాకూర్‌కు సమన్లు జారీ చేశారు. గురువారం ఢిల్లీలోని ఐఎఫ్ఎస్‌వో కార్యాలయానికి విచారణకు రావాలని ఆదేశించారని ఆ పార్టీ అధికార ప్రతినిధి ఒకరు బుధవారం తెలిపారు. తనకు ఢిల్లీ పోలీసులు నోటీసులివ్వడంపై రాజేశ్ ఠాకూర్ స్పందించారు. తనకు మంగళవారం నోటీసు వచ్చిందని, అయితే తనకు ఈ నోటీసు ఎందుకు ఇచ్చారో అర్థం కావడం లేదన్నారు. ఇదొక అరాచక వైఖరి అని విమర్శించారు. ఈ అంశంపై న్యాయపరమైన అభిప్రాయాలు తీసుకొంటానని చెప్పారు.

లోక్‌సభ ఎన్నికల పరిశీలనకు

విదేశీ పార్టీల నేతలు

బీజేపీ ఆహ్వానంపై వచ్చిన 10 దేశాల ప్రతినిధులు

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికలు జరిగే తీరును ప్రత్యక్షంగా చూసేందుకు 10 దేశాలకు చెందిన 18 రాజకీయ పార్టీల ప్రతినిధులు బుధవారం వచ్చారు. బీజేపీ ఆహ్వానంపై వచ్చిన వీరు ఆ పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు సుబ్రహ్మణ్యం జైశంకర్, అశ్విని వైష్ణవ్‌లతో సమావేశమయ్యారు. వీరితో బీజేపీ ఎన్నికల ప్రచార వ్యూహాలు, దేశంలోని ఎన్నికల ప్రక్రియల గురించి చర్చించినట్లు నడ్డా ఓ ట్వీట్‌లో తెలిపారు. 'బీజేపీ గురించి తెలుసుకోండి' అనే కార్యక్రమంలో భాగంగా ఈ సమావేశం జరిగిందని చెప్పారు.

టీఎంసీ కంటే బీజేపీకి ఓటేయడం బెటర్!

కాంగ్రెస్ నేత అధీర్

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు, బహరంపూర్ లోక్‌సభ నియోజకవర్గం అభ్యర్థి అధీర్ రంజన్ చౌదరి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన మంగళవారం ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ, ఈ ఎన్నికలు దేశ భవిష్యత్తును నిర్ణయిస్తాయని చెప్పారు. లౌకికవాద శక్తులకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్, వామపక్షాలు గెలవాలన్నారు. ఈ పార్టీలు గెలవక పోతే, లౌకికవాదం ప్రమాదంలో పడుతుందన్నారు. టీఎంసీకి ఓటు వేయడం కంటే బీజేపీకి ఓటు వేయడం బెటర్. కాబట్టి కాంగ్రెస్‌కి ఓటు వేయండి. బీజేపీ, టీఎంసీకి వేయొద్దు' అని పేర్కొన్నారు. అయితే ఆ వీడియో ఎడిట్ చేసినదని కాంగ్రెస్ ఆరోపించింది.

అలా చేస్తే దావూద్ కూడా

ప్రచారం చేస్తాడు!

న్యూఢిల్లీ: వివిధ కేసుల్లో అరెస్టయ్యి జైలులో ఉన్న నేతలు వర్చువల్‌గా ఎన్నికల ప్రచారం చేయడానికి అనుమతించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. ఇలా అనుమతిస్తే భయంకరమైన నేరస్తులు, దావూద్ ఇబ్రహీం సైతం రాజకీయ పార్టీలలో తమ పేర్లను నమోదు చేసుకుని ప్రచారం చేస్తారంటూ హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. న్యాయపరమైన ఉత్తర్వుల కారణంగా జైలులో ఉంటే అలాంటి వారికి మాత్రమే వర్చువల్ ప్రచారానికి కోర్టు అనుమతిస్తుందన్నారు. ఇది చట్టం ప్రాథమిక సూత్రాలకు విరుద్ధమని తెలిపింది.

మోదీ గ్యారెంటీనా? ములాయం లెగసీనా?

ఎస్పీ కంచుకోట మైన్‌పురిలో ఆసక్తికర పోరు

మైన్‌పురి: గత లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్ అంతటా బీజేపీ వేవ్ కనిపించినా, మైన్‌పురి లోక్‌సభ నియోజకవర్గంలో మాత్రం ఎస్పీ వ్యవస్థాపకులు ములాయం సింగ్ యాదవ్ విజయం సాధించారు. ఈ సారి ఎలాగైనా ఎస్పీ కంచుకోటను బద్దలు కొట్టాలని బీజేపీ శతా విధాలా ప్రయత్నిస్తున్నది. దీంతో ఈసారి ఇక్కడ పోరు మోదీ కీ గ్యారెంటీనా లేక ములాయం లెగసీనా అన్నట్టుగా పోరు ఉన్నది. మైన్‌పురి మూడు దశబ్దాలుగా ఎస్పీకి కంచుకోటగా ఉన్నది. 2022లో ములాయం మరణం తర్వాత ఇక్కడి నుంచి ఆయన కోడలు, అఖిలేశ్ యాదవ్ భార్య డింపుల్ యాదవ్ పోటీచేసి గెలుపొందారు. ఈసారి కూడా ఆమె ఇక్కడి నుంచి పోటీచేస్తున్నారు. ములాయం అడుగు జాడల్లో నడుస్తానని, ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తానని ఆమె ప్రచార సభల్లో ప్రధానంగా పేర్కొంటున్నారు. ఈసారి మైన్‌పురి నుంచి బీజేపీ అభ్యర్థిగా స్థానిక మైన్‌పురి ఎమ్మెల్యే సదర్ జైవీర్‌సింగ్ పోటీచేస్తున్నారు. 'మోదీ గ్యారెంటీ'ల తోపాటు తాను చేసిన అభివృద్ధి పనులే తనను గెలిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ప్రజ్వల్‌కు సమన్లు

- సెక్స్ స్కాండల్ కేసులో జారీ
- 24 గంటల్లో విచారణకు హాజరు కావాలని ఆదేశించిన సిట్
- వారం సమయం కోరిన ప్రజ్వల్
- పాస్‌పోర్టు రద్దు చేయాలన్న సీఎం

బెంగళూరు, మే 1: దేశవ్యాప్తంగా సంచలనం రేపిన కర్ణాటక సెక్స్ స్కాండల్ కేసులో బుధవారం కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ప్రధాన నిందితుడు జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ, రెండో నిందితుడు ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణలకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సమన్లు జారీచేసింది. 24 గంటల్లోగా ఎస్పీ సీమా లాట్కార్ ముందు హాజరుకావాలని ఆదేశించింది. కాగా, తనపై వస్తున్న ఆరోపణలపై ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ తొలిసారి స్పందించాడు. త్వరలోనే వాస్తవాలు బయటకు వస్తాయని వ్యాఖ్యానించాడు. 'సిట్ ముందు హాజరుకావడానికి 7 రోజుల సమయం కావాలి. ఇప్పుడు నేను బెంగళూరులో లేను' అంటూ 'ఎక్స్'లో సందేశాన్ని పోస్ట్ చేశాడు. సెక్స్ స్కాండల్ వెలుగులోకి వచ్చిన కొద్ది గంటల్లోనే ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ డిప్లొమాటిక్ పాస్‌పోర్ట్ ఉపయోగించి ఏప్రిల్ 28న జర్మనీ పారిపోవటం రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. అతడి పాస్‌పోర్ట్ రద్దు చేసి, ప్రజ్వల్‌ను భారత్‌కు రప్పించటంలో సాయం చేయాలని ప్రధాని మోదీని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య కోరారు.

ప్రధాని మోదీకి ముందే తెలుసు..

పలువురు మహిళలపై ఎంపీ ప్రజ్వల్ లైంగిక వేధింపులకు పాల్పడ్డ సంగతి ప్రధాని మోదీకి ముందే తెలుసునని, అయినా ప్రజ్వల్ గురించి గొప్పగా చెబుతూ, అతడికి ఓటేయాలని ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ ఓటర్లను కోరారని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనేత్ తప్పుబట్టారు. 'మోదీ పరివార్'లో భాగమని ఎంపీ ప్రజ్వల్ చెప్పుకుంటున్న సోషల్ మీడియా ప్రొఫైల్‌ను ఆమె బుధవారం మీడియాకు చూపారు. 'ఎంపీ ప్రజ్వల్‌పై లైంగిక నేరాలు, అతడు ఎలాంటి వాడన్నది బీజేపీ నాయకుడు దేవరాజే గౌడ 2023 డిసెంబర్‌లోనే బయటపెట్టారు. అతడ్ని కూటమి అభ్యర్థిగా నిలబెట్టవద్దంటూ ప్రధాని మోదీ, అమిత్ షా, జేపీ నడ్డాలకు మెయిల్స్, లేఖలు పంపాడు' అని ఆమె అన్నారు. అయితే లైంగిక వేధింపుల గురించి తమ పార్టీ నేత తనకు లేఖ రాశాడన్న ఆరోపణలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర ఖండించారు.

గోవాలో గెలుపెవరిది?

- రెండు సీట్లు.. రెండు పార్టీలు
- బీజేపీ - కాంగ్రెస్ మధ్య పోటీ
- గత ఎన్నికల్లో చెరో స్థానం
- మోదీ చరిష్మాపైనే బీజేపీ భారం
- ప్రభుత్వ వ్యతిరేకతపై కాంగ్రెస్ ఆశలు

పనాజీ, మే 1: సార్వత్రిక ఎన్నికల్లో గోవా ప్రజల తీర్పుపై ఆసక్తి నెలకొన్నది. ఇక్కడ బీజేపీ – కాంగ్రెస్ మధ్య హోరాహోరీ పోరు నడుస్తున్నది. ఉన్నది రెండు స్థానాలే అయినా రెండు పార్టీలూ గోవాను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. గత ఎన్నికల్లో నార్త్ గోవా స్థానంలో బీజేపీ గెలవగా, సౌత్ గోవాను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఈసారి రెండు స్థానాలపై రెండు పార్టీలూ కన్నేశాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉన్న వ్యతిరేకత తమకు కలిసొస్తుందని కాంగ్రెస్ నమ్మకంగా ఉండగా, ప్రధాని మోదీ చరిష్మాతో ఈసారి రెండు సీట్లూ తమవేనని బీజేపీ భరోసా పెట్టుకున్నది.

బీజేపీ వర్సెస్ కాంగ్రెస్

ఉత్తర గోవా స్థానం నుంచి బీజేపీ తరపున మరోసారి సిట్టింగ్ ఎంపీ, కేంద్ర మంత్రి శ్రీపాద్ నాయక్ పోటీ చేస్తుండగా, కాంగ్రెస్ తరపున రమాకాంత్ ఖలప్ పోటీ చేస్తున్నారు. ఇక్కడి నుంచి శ్రీపాద్ నాయక్ ఇప్పటికే ఐదుసార్లు ఎంపీగా విజయం సాధించారు. 1999 నుంచి ఆయనే ఎంపీగా ఉన్నారు. ఆరో సారి కూడా విజయంపై ఆయన ధీమాగా ఉన్నారు. ఆయనకు రమాకాంత్ ఖలప్ గట్టి పోటీ ఇస్తున్నారు. రెవల్యూషనరీ గోవన్స్ పార్టీ(ఆర్జీపీ) తరపున పోటీ చేస్తున్న ఎమ్మెల్యే మనోజ్ పరాబ్ కూడా భారీగానే ఓట్లు సాధించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. దక్షిణ గోవాలో గత ఎన్నికల్లో కాంగ్రెస్ స్వల్ప మెజారిటీతో విజయం సాధించింది. ఈ సారి ఇక్కడ బీజేపీ తరపున వ్యాపారవేత్త పల్లవి డెంపో పోటీ చేస్తుండగా, కాంగ్రెస్ తరపున మాజీ నేవి అధికారి కెప్టెన్ విరియాటో ఫెర్నాండేజ్ పోటీ చేస్తున్నారు. ఇద్దరి మధ్య తీవ్ర పోటీ ఉన్నది.

హోరాహోరీ పోరు

కేంద్ర ప్రభుత్వంతో పాటు గోవాలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వంపై వ్యతిరేకత, హామీలు నిలబెట్టుకోకపోవడంతో ప్రజల్లోని అసంతృప్తి తమకు కలిసొస్తుందని, రెండు స్థానాలను కైవసం చేసుకుంటామని కాంగ్రెస్ నమ్మకంగా ఉంది. గోవా ఫార్వర్డ్ పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీతో స్నేహం కూడా కాంగ్రెస్‌కు కలిసొచ్చే అవకాశం ఉంది. అయితే, రెవల్యూషనరీ గోవన్స్ పార్టీ చీల్చే ఓట్ల ప్రభావం కాంగ్రెస్ విజయావకాశాలకు నష్టం చేయవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక, బీజేపీ పూర్తిగా మోదీ చరిష్మాపైనే ఆధారపడింది. సర్వేలు కూడా గోవాలో బీజేపీ – కాంగ్రెస్ మధ్య హోరాహోరీ పోరు ఉన్నదని చెప్తున్నాయి.

పోలింగ్ శాతంపై దోబూచులాట

మొదటిపేజీ తరువాయి...

అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా ఈసారి ఓటింగ్ శాతాన్ని వెల్లడించడానికి రోజుల తరబడి సమయం ఎందుకు పడుతున్నదని ప్రశ్నిస్తున్నారు. ఓటింగ్ జరిగిన రోజు సాయంత్రం 7 గంటల వరకు పోలైన ఓట్ల లెక్కలకు, తుది ఓట్ల శాతానికి దాదాపు 6 శాతం తేడా ఉండటం అసాధారణంగా చెప్తున్నారు.

ఎందుకింత జాప్యం ?

పోలింగ్ ముగిసిన 24 గంటల్లోపే ఎన్నికల కమిషన్ తుది పోలింగ్ శాతాన్ని వెల్లడిస్తుంది. ఎక్కువలో ఎక్కువగా పోలింగ్ ముగిసిన 48 గంటల్లోపు అధికారికంగా ఎంత శాతం పోలింగ్ జరిగిందో ఈసీ ప్రకటించేస్తుంది. 2019లో మొదటి విడత ఎన్నికలు ఏప్రిల్ 11న జరిగితే, 13న ప్రతి నియోజకవర్గానికి సంబంధించిన తుది ఓటింగ్ శాతాన్ని ఈసీ వెల్లడించింది. కానీ, ఈసారి అలా జరగలేదు. సార్వత్రిక ఎన్నికల మొదటి విడత పోలింగ్ ఏప్రిల్ 19న జరిగింది. రెండో విడత ఏప్రిల్ 26న పూర్తయ్యింది. తుది ఓటింగ్ శాతాన్ని ఈసీ ఏప్రిల్ 30న వెల్లడించింది. అంటే, మొదటి విడత పోలింగ్ జరిగిన 11 రోజులకు, రెండో విడత జరిగిన 4 రోజులకు పోలింగ్ శాతాన్ని వెల్లడించింది. ఇలా జాప్యం జరగడం ఇదే మొదటిసారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పేర్కొన్నారు.

అసాధారణంగా పెరిగిన ఓటింగ్ శాతం

సాధారణంగా సాయంత్రం 7 గంటల నాటికి దాదాపుగా పోలింగ్ పూర్తవుతుంది. అప్పటికి నమోదైన ఓటింగ్ శాతానికి ఒకటి, రెండు శాతానికి మించి తుది పోలింగ్ శాతం ఉండదు. 2019 మొదటి విడతలో పోలింగ్ జరిగిన రోజు 67.11 శాతం నమోదైందని ఈసీ వెల్లడించగా, ఏప్రిల్ 13న 69.43 శాతం నమోదైనట్టు తుది ప్రకటన చేసింది. రెండో దశలో పోలింగ్ జరిగిన ఏప్రిల్ 18 నాడు 66 శాతంగా చెప్పగా, ఏప్రిల్ 19న 67.84 శాతం నమోదైందని అధికారికంగా వెల్లడించింది. అంటే మొదటి, తుది లెక్కకు మధ్య తేడా కేవలం 1 – 2 శాతమే ఉంది. ఇప్పుడు మాత్రం ఏప్రిల్ 19న తొలి విడత పోలింగ్ జరిగినప్పుడు 60 శాతం జరిగిందని ఈసీ వెల్లడించింది. ఏప్రిల్ 30న తుది ప్రకటనలో మాత్రం 66.14 శాతం నమోదైనట్టు వెల్లడించింది. రెండో విడతలోనూ పోలింగ్ జరిగిన ఏప్రిల్ 26 సాయంత్రం 60.96 శాతం జరిగినట్టు ఈసీ వెల్లడించింది. ఏప్రిల్ 30న ప్రకటనలో మాత్రం 66.71 శాతం నమోదైనట్టు పేర్కొన్నది. ఓటింగ్ శాతంలో ఇంత భారీ వ్యత్యాసం ఉండటంపై రాజకీయ విశ్లేషకుడు యోగేంద్ర యాదవ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తాను 35 ఏండ్లుగా ఎన్నికలను అధ్యయనం చేస్తున్నానని, ఓటింగ్ పూర్తైన 24 గంటల్లో తుది డాటా రావాలని ఆయన పేర్కొన్నారు. టీఎంసీ నేత డెరెక్ ఓబ్రెయిన్ సైతం పలు అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రతి విడత పోలింగ్ పూర్తైన తర్వాత ఈసీ ఎందుకు ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించలేదని, ఎందుకు పోలింగ్ డాటా వెల్లడించడంలో జాప్యం జరిగిందని ఆయన ప్రశ్నించారు.

ఓటర్ల సంఖ్యను ఎందుకు వెల్లడించడం లేదు ?

లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ఎంత మంది ఓటర్లు ఉన్నారు, ఎంత మంది ఓటు వేశారనే వివరాలను కూడా ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో పొందుపర్చలేదని ప్రతిపక్ష పార్టీల నేతలు లేవనెత్తుతున్నారు. ఓటర్ల అసలు సంఖ్య వెల్లడించకుండా పోలింగ్ శాతం వెల్లడించడం అర్థరహితమని సీపీఎం నేత సీతారాం ఏచూరి